ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు

చిక్కడపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వీరేశం

ఇంటర్వ్యూ



చిక్కడపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ సమస్యలు, రద్దీ ఏర్పడకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని ఇన్‌స్పెక్టర్ వీరేశం తెలిపారు. బోనాలు, దసరా, హోళి, దీపావళి, రంజాన్, క్రిస్మస్ తదితర పండుగ రోజుల్లోనూ తమ పీఎస్ పరిధిలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ముఖ్యంగా పోటీ పరీక్షల అభ్యర్థులు పలు అంశాలపై ఉద్యమాలు, రాస్తారోకోలు చేయడం, వారికి రాజకీయ నేతల మద్దతు తెలిపే సందర్భంలో ఇబ్బందులు రాకుండా ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా వీరేశంతో 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూ...

మీ పరిధిలో ఎన్ని ట్రాఫిక్ సమస్యాత్మక ప్రాంతాలున్నాయి?

ముషీరాబాద్ పీస్ పరిధిలో ఆర్టీసీక్రాస్‌రోడ్, అప్పర్ ట్యాంక్‌బండ్, లోయర్‌ట్యాంక్‌బండ్ కట్టమైసమ్మ దేవాలయం, బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం, ముషీరాబాద్ చౌరస్తా, రామ్‌నగర్ చౌరస్తా వంటి ప్రాంతాల్లో ట్రాఫిక్‌రద్దీ ఏర్పడే సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించాము. ట్రాఫిక్ సమస్య రాకుండా అనేక చర్యలు తీసుకుని అమలు చేస్తున్నాం. పీఎస్ పరిధిలో తరచుగా వీఐపీ మూవ్‌మెంట్ ఉంటున్నందున ఉన్న సిబ్బందితోనే తగు చర్యలు తీసుకుంటున్నాము.

పండుగలు, ఉత్సవాల సమయంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఏం చర్యలు తీసుకున్నారు?

పలు పండుగల నేపధ్యంలో ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక ట్రాఫిక్ పోలీస్ పికెట్‌లు ఏర్పాటు చేశాము. ఉదయం నుంచి సాయంత్రం వరకూ కానిస్టేబుల్స్, హోమ్‌గార్డ్‌లు ఉండి ట్రాఫిక్‌ను సాఫీగా వెళ్లేవిధంగా కృషి చేశాం. పండుగలు, ఉత్సవాల రోజుల్లో ప్రధాన ప్రాంతాల్లో ఎక్కువ సిబ్బందిని ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్య వెంటవెంటనే పరిష్కరిస్తున్నాం.

అంబులెన్స్‌లు సాఫీగా వెళ్తున్నాయా? ఏమైనా ఇబ్బందులున్నాయా.?

ప్రధాన చౌరస్తాల్లో అంబులెన్స్‌లు వచ్చిన టైంలో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటే వాటిని త్వరగా వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నాము. అంబులెన్స్ వెళ్లిపోయాక యథావిధిగా రాకపోకలు కొనసాగుతాయి.

ఆర్టీసీ క్రాస్‌రోడ్ అంటేనే సినిమాలు, హోటళ్లకు కేంద్రం. స్టార్‌హీరోల సినిమాలు విడుదల టైంలో ట్రాఫిక్‌ను ఎలా కంట్రోల్ చేస్తున్నారు?

స్టార్‌హీరోల కొత్త సినిమాలు విడుదల సందర్భంలో క్రాస్‌రోడ్‌లో ట్రాఫిక్ చిక్కులు ఏర్పడుతున్నాయి. అభిమానులు థియేటర్‌ల వద్ద బాణసంచా కాల్చడం, స్వీట్లు తినిపించడం, అభిమానులు పెద్దఎత్తున గుమిగూడడంతో పాటు పలు సంఘాలు, పార్టీలు క్రాస్‌రోడ్‌లో ఉద్యమాలు నిర్వహించిన సమయాల్లో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. ఈ సమయాల్లో లా అండ్ ఆర్డర్ పోలీసుల సహకారంతో సమస్య జఠిలం కాకుండా చూస్తున్నాము.

ఓబీసీ ప్రభుత్వ ఉద్యోగులందరూ ఐక్యంగా ఉండాలి

- తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా
- రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్



సదస్సులో మాట్లాడుతున్న బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్

రాంనగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ పేర్కొన్నారు. ప్రభుత్వరంగ సంస్థల్లో పని చేస్తున్న ఓబీసీ ఉద్యోగులందరూ ఐక్యతను చాటి తమకు రావాల్సిన వాటాను సాధించుకోవాలని పేర్కొన్నారు. బీసీ జనాభా లెక్కలు తేల్చి రాజ్యాంగపరంగా రావాల్సిన వాటాను ఇచ్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో ఈనెల 6వ తేదీ నుంచి బీసీ జనాభా లెక్కల సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఈ సర్వేలో బీసీలందరూ పాల్గొని తమ వివరాలను సర్వే బృందానికి తెలియజేయాలని సూచించారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఓబీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.శంకర్, ఎం.మోహన్‌ల అధ్యక్షతన సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నిరంజన్ మాట్లాడుతూ స్వర్గీయ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ గ్రామీణ ప్రాంతంలోని పేద ప్రజలకు బ్యాంకు రుణాలు అందజేయాలనే లక్ష్యంతో గ్రామీణ బ్యాంకులను ప్రారంభించారని తెలిపారు. గ్రామీణ బ్యాంకులు గ్రామాలలోని పేదలకు కావాల్సిన రుణాలను అందజేసి వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు బ్యాంకు ఉద్యోగులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ శాఖలలో పని చేసే ఓబీసీ ఉద్యోగుల మనోభావాలను గుర్తిస్తూ వాటి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఓబీసీ ఉద్యోగులపై ఉన్న క్రీమీలేయర్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం గ్రామీణ బ్యాంకు చైర్మన్ వై.శోభ మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు తమ బ్యాంకు సేవలను మరింత విస్తరించేందుకు కృషి చేస్తామన్నారు. ఓబీసీ ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి కె.శంకర్, ఎం.మోహన్‌లు మాట్లాడుతూ ఓబీసీ ఉద్యోగులకు న్యాయపరంగా రావాల్సిన ప్రమోషన్‌లు ఇతర బెనిఫిట్‌లు వచ్చే లా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ బ్యాంకులో రాష్ట్ర వ్యాప్తంగా 900 ఓబీసీ ఉద్యోగులు పని చేస్తున్నారని వారన్నారు. ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి నూతన కమిటీ ఎన్నికవుతుందన్నారు. సమావేశంలో ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ ఓబీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి.కరుణానిధి, ఏఐఆర్ఆర్‌బీఈఏ సెక్రటరీ జనరల్ ఎస్.వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్‌బీఐ ఓబీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.రాజు, యు.చిన్నయ్య, బి.రవికాంత్, వి.దానకర్ణచారి, పి.శ్రీనివాస్‌గౌడ్, వంశీకృష్ణ, లోకేష్, భిక్షమయ్య, మధుసూదన్, శ్రీమన్నారాయణ, కె.అశోక్, విజయ్‌సింగ్, సత్యనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పిల్లి శ్రీనివాస్

మున్నూరుకాపుల కులవృత్తిని సర్వేలో చేర్చాలి

బర్కత్‌పుర నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మున్నూరుకాపుల తమ కులవృత్తి వ్యవసాయాన్ని సమగ్ర కుటుంబ సర్వేలో చేర్చాలని తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం కాచిగూడ మున్నూరుకాపు భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్నూరుకాపులు సమగ్ర సర్వేకు పూర్తి సహకారం అందించాలని కోరారు. సమావేశంలో మహాసభ కన్వీనర్లు దండు నరేందర్, బి.పద్మారావు, కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర్‌రావు, మహేష్, శ్రీనివాస్, కోట శంకర్, మహాసభ మహిళా అధ్యక్షురాలు చామకూర సుజాత, గుంటి మంజుల, శాంతి ప్రియ తదితరులు పాల్గొన్నారు.

- శుభాకాంక్షలు



టీటీడీ చైర్మన్‌గా నియమితులైన బీవీఆర్ నాయుడును సన్మానించి శుభాకాంక్షలు తెలియజేసిన టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్ష, కార్యదర్శులు పి.సాయిబాబా, పలుస బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు
- రాంనగర్, ఆంధ్రజ్యోతి

రైల్వేలో కాంట్రాక్ట్ పద్ధతిని తొలగించాలి

డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్

హైదరాబాద్ సిటీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైల్వేలో కాంట్రాక్ట్ పద్ధతిని ఎత్తివేసి, ఖాళీలను భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డీవైఎఫ్ఐ హైదరాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య పార్క్ వద్ద సంఘం 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం రమేష్ మాట్లాడుతూ రైల్వేలో రిటైర్డ్ ఉద్యోగులతో ఖాళీలను భర్తీ చేయాలనే ఆలోచనను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం పరిశ్రమలన్నింటిని ప్రైవేటు పరం చేస్తూ ఆదాని, అంబానీలకు కట్టబెడుతోందని మండిపడ్డారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పిన కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందని ఆరోపించారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ జావిద్, సహాయ కార్యదర్శి రవి, ఉపాధ్యక్షులు క్రాంతి, వీరేందర్, అజయ్‌రెడ్డి, శివ, సామేల్ తదితరులు పాల్గొన్నారు.



ఆవిర్భావ వేడుకల్లో జెండా ఆవిష్కరించిన డీవైఎఫ్ఐ నాయకులు

5న బీసీల మేధోమథన సదస్సుకు ఏర్పాట్లు

బర్కత్‌పుర నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): బీసీ ఉద్యమాన్ని మరింత పటిష్టం చేయడానికి, అవసరమైన నిర్ణయాలు తీసుకోవడానికి ఈనెల 5న నగరంలో బీసీల మేధోమథన సదస్సు కోసం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం తెలిపారు. ఆదివారం కాచిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ మేధోమదన సదస్సుకు బీసీ మేధావులు, లెక్చరర్లు, యువతీ, యువకులు, విద్యార్థులు, బీసీ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారని తెలిపారు. కాచిగూడలోని అభినందన గ్రాండ్ హోటల్‌లో ఈ మేధోమదన సదస్సు జరగనున్నట్లు తెలిపారు. సదస్సులో భవిష్యత్ ఉద్యమ ప్రణాళికను రూపొందిస్తామని, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ పర్యవేక్షణలో ఈ సదస్సు జరుగుతుందన్నారు.

పార్వతీక్షీరలింగేశ్వరస్వామికి ప్రత్యేకపూజలు

చిక్కడపల్లి, నవంబర్ 3 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ క్రాస్‌రోడ్ లక్ష్మీగణపతి దేవాలయం ఆవరణలోని పార్వతీ క్షీరలింగేశ్వరస్వామి మందిరంలో కార్తీకమాస పవిత్రోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేకపూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఏకవార రుద్రాభిషేకాలు, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, ఆకాశదీప పూజ, కార్తీకపురాణ ప్రవచనాలు, భక్తులచే దీపారాధన, ప్రదోషపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో లక్ష్మారెడ్డి, మాజీ చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, అర్చకులు కాశీనాథశర్మ, జగన్మోహనాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

'సుప్రీంకోర్టు రీజినల్ బెంచ్‌ను ఏర్పాటు చేయాలి'

బర్కత్‌పుర నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు రీజినల్ బెంచ్‌ను ఏర్పాటు చేయాలని దేశ ఉన్నత న్యాయస్థానం చీఫ్ జస్టిస్‌కు లేఖ రాసినట్లు దక్షిణ భారత అడ్వకేట్ జేఏసీ అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది సుధానాగేందర్ వెల్లడించారు. ఆదివారం బర్కత్‌పురలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలోని 130 ఆర్టికల్ ప్రకారం సుప్రీంకోర్టు రీజనల్ బెంచ్‌ను దేశంలో ఎక్కడైనా ఏర్పాటు చేసే అధికారం సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌కు ఉందని గుర్తు చేశారు. త్వరలో ఢిల్లీకి వెళ్లి కేంద్ర న్యాయ శాఖ మంత్రి, సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌లను కలిసి వినతిపత్రాలు అందజేస్తామన్నారు.



కృష్ణకుమారి స్మారక జాతీయ పురస్కారం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

ఆరిగపూడి దంపతుల సేవలు అజరామరం

రాంనగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): లయన్ ఆరిగపూడి దంపతుల సేవలు అజరామరమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆరిగపూడి పూర్ణచంద్రరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ కవి డాక్టర్ బిక్కి కృష్ణ అధ్యక్షతన స్వర్గీయ కృష్ణకుమారి స్మారక జాతీయ పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన జస్టిస్ టి.రజనీ, ఆచార్య కొలకలూరి ఇనాక్, జస్టిస్ బి.చంద్రకుమార్, రిటైర్డ్ ఇన్‌కంటాక్స్ చీఫ్ కమిషనర్ ఎం.నరసింహప్ప, రిటైర్డ్ ఐజీ బి.వి.రమణకుమార్‌లు మాట్లాడారు. మహిళలకు కళా, సాహిత్య సేవా రంగాలలో వారికి సమాన ప్రాధాన్యత కల్పించాలన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణ కోడూరి, భగీరథ, గీతాంజలి, రామచంద్రనాయక్, వాలేటి శ్రీనివాస్, కె.అల్పనజ్యోతి, రాంబాబు, శ్రీరాందత్తి, డాక్టర్ రఘు ఆరికపూడి, జానమద్ది విజయ్‌భాస్కర్‌లకు లయన్ ఎ.కృష్ణకుమారి స్మారక జాతీయ పురస్కారాలను ప్రదానం చేశారు.



నూతన అధ్యక్షుడు సురేష్‌కుమార్, కార్యవర్గసభ్యులు

నూతన కార్యవర్గం ఎన్నిక

గోల్నాక, నవంబర్ 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సెపక్‌తక్రా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా పెరిక సురేష్‌కుమార్ ఎన్నికయ్యారు. ఆదివారం ఫతేమైదాన్‌లో జరిగిన ఎన్నికల్లో 21 మందితో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. తెలంగాణ సెపక్‌తక్రా అడ్‌హక్ కమిటీ చైర్మన్ జగన్నాథ్‌స్వామి ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో రిటర్నింగ్ అధికారిగా డి.ఎల్.నరసింహారావు, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ అబ్జర్వర్ ఓంకార్, ఒలంపిక్ అసోసియేషన్ పరాగ్‌వాడ్కర్ అబ్జర్వర్‌గా వ్యవహరించారు. కొత్త కార్యవర్గం నాలుగేళ్లపాటు కొనసాగనుంది. ఈసందర్భంగా నూతన అధ్యక్షుడు సురేష్‌కుమార్ మాట్లాడుతూ సెపక్‌తక్రాలో రాష్ట్రాన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. విజయభాస్కర్‌రెడ్డి, శిరీష, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కొరిడె శ్రీకాంత్, ట్రెజరర్‌గా మీనం వికేస్‌కుమార్, మరో ఎనిమిది మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎన్నికయ్యారు.

ప్రజల సహకారంతో మరింత అభివృద్ధి

ఎమ్మెల్యే ముఠా గోపాల్



భోలక్‌పూర్ పీ అండ్ టీ కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజల సహకారంతో ముషీరాబాద్‌ను మరింత అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఆదివారం భోలక్‌పూర్ డివిజన్‌లోని పీ అండ్ టీ కాలనీలో రూ.45 లక్షలతో జీ ప్లస్ వన్ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 5 నెలల్లో కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులను పూర్తి చేసి కమ్యూనిటీ హాల్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. అభివృద్ధి పనుల విషయంలో స్థానికులు సామాజిక బాధ్యతతో అధికారులు, తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే కావాల్సిన సదుపాయాలను కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. రాజా డీలక్స్ చౌరస్తా వద్ద నిత్యం డ్రైనేజీ సమస్య వల్ల రోడ్డు గుంతలమయంగా మారుతోందని పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు సమన్వయంతో పనిచేస్తూ సమస్యను శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోడ్లను ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి పరుస్తూ ప్రజల రాకపోకలకు ఆటంకాలు లేకుండా చేయిస్తున్నాం అని తెలిపారు. కార్యక్రమంలో ముఠా జైసింహ, బింగి నవీన్, వై.శ్రీనివాస్‌రావు, శంకర్‌గౌడ్, గోవింద్‌రాజ్, మగ్బూల్, లత, కాలనీ నాయకులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో అంబేడ్కర్ కాలేజీ జట్టు ద్వితీయ స్థానం



కరాటేలో ద్వితీయస్థానంలో నిలిచిన అంబేడ్కర్ కాలేజీ విద్యార్థులు

రాంనగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ స్థాయి కరాటే పోటీలో ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ కళాశాల విద్యార్థుల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. ఆదివారం జరిగిన ఈ పోటీల్లో 34 జట్లు పాల్గొనగా డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ కళాశాల నుంచి పోటీలో పాల్గొన్న ఎంబీఏ ప్రథమ సంవత్సరం విద్యార్థి ఎ.పురుషోత్తం బంగారు పతకం, బీఎస్సీ ప్రథమ సంవత్సరం విద్యార్థి కె.కౌశిక్ రజత పతకం, బీకామ్ ప్రథమ సంవత్సరం విద్యార్థి ఎం.పుష్కర్ యాదవ్ కాంస్య పతకం గెలుచుకున్నారు. విజేతలకు ఉస్మానియా యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ రాజేష్‌కుమార్ పతకాలు, సర్టిఫికెట్లను అందజేశారు. పతకం గెలిచిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ సరోజ వివేక్ సిబ్బంది తదితరులు అభినందించారు.



సనాతన హిందూ దేవాలయాల పరిరక్షణ సమితిరాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

ఆలయాలపై దాడులు జరగకుండా

ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి

గోల్నాక, నవంబర్ 3 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కుర్మగూడలోని ముత్యాలమ్మ దేవాలయంలో అమ్మవారి విగ్రహం ధ్వంసం సంఘటనను తీవ్రంగా ఖండిస్తూ దేశంలో ఆలయాలపై దాడులు జరుగకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని సనాతన హిందూ దేవాలయ పరిరక్షణ సమితి రాష్ట్ర చైర్మన్ పుట్టి యాదగిరి ముదిరాజ్, అధ్యక్షుడు యమున్‌సింగ్‌లు డిమాండ్ చేశారు. ఆదివారం గోల్నాక డివిజన్ తిరుమలనగర్‌లోని సనాతన హిందూ దేవాలయ పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్రకార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ.. సికింద్రాబాద్ కుర్మగూడలోని ముత్యాలమ్మ దేవాలయంపై జరిగిన దాడిని అఘోరమాత విచ్చేసిన తరువాత ఆలయాన్ని కట్టాలని చెప్పగా అందరూ సంకల్పం చేసుకుని ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారన్నారు. సమావేశంలో సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడకంటి బ్రహ్మాచారి, జి.శంకర్, ఈ.ఎస్.ధనుంజయ, జె.కె.రాయుడు, రాంచందర్‌ముదిరాజ్, కృష్ణాగౌడ్, లక్ష్మణ్‌గౌడ్, కె.సుధాకర్, జి.నారాయణ, నరసింహారెడ్డి, అంకిరెడ్డి, ఎ.చంద్రమౌళి, వి.ఆర్.ఎ.భాస్కర్, కుమార్, జె.విజయకుమార్, వై.శ్రీనివాస్,డి.అంజయ్య ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

- టీటీడీ బోర్డు సభ్యుడికి సన్మానం



తెలంగాణ జనసేన పార్టీ సీనియర్ నాయకుడు, పవన్‌కల్యాన్‌కు సన్నిహితుడు బొంగునూరి మహేందర్‌రెడ్డిని టీటీడీ బోర్డు సభ్యులుగా నియమించిన సందర్భంగా దూలపల్లి అశోక్ విల్లాలో కలిసి సన్మానం చేసిన తెలంగాణ బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆర్య మహేందర్, తెలంగాణ మున్నూరుకాపు యువజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దశరథం పటేల్, కాంగ్రెస్ నాయకుడు జే.ఎన్.వెంకట్, బీసీ ఐక్యవేదిక నగర అధ్యక్షుడు రాజేష్‌కమార్ - రాంనగర్, ఆంధ్రజ్యోతి

మూసీలో దూకి యువకుడి ఆత్మహత్యాయత్నం

- నల్లగొండ జిల్లా కేతేపల్లిలో ఘటన

కేతేపల్లి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): వంతెన పైనుంచి మూసీ నదిలోకి దూకి యువకుడు ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని ఉప్పలపహాడ్ గ్రామ శివారులో ఆదివారం జరిగింది. ఎస్ఐ శివతేజ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లా గన్నవరానికి చెందిన వై.కృష్ణకుమారుడు యశ్వంత్ హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. దీపావళి పండుగకు స్వగ్రామం వెళ్లిన యశ్వంత్ ఆదివారం హైదరాబాద్‌కు తన ద్విచక్ర వాహనంపై బయల్దేరాడు. మార్గం మధ్యలో మధ్యాహ్నం మూసీ నదిపై గల వంతెన పైకి రాగానే రోడ్డు పక్కకు మోటార్ సైకిల్‌ను నిలిపిన యశ్వంత్ వంతెనపై నుంచి నదిలోకి దూకేశాడు. అటుగా వెళ్తున్న వాహనదారులు గమనించి కేతేపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ శివతేజ తన సిబ్బందితో కలిసి హుటాహుటిన ఘటనా స్థలానికి వచ్చి అతడిని నదిలోంచి బయటకు తీయించారు. తీవ్రగాయాలు కావడంతో ప్రాణాపాయ స్థితికి చేరిన అతడిని 108 అంబులెన్స్‌లో సూర్యాపేట జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడి వద్ద లభించిన ఆధారాలతో గన్నవరంలోని అతడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

టీటీడీ చైర్మన్ల నియామకం పట్ల హర్షం

చిక్కడపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): టీటీడీ చైర్మన్‌గా బొల్లినేని రాజశేఖర్‌నాయుడు నియామకం కావడం పట్ల ఆ పార్టీ జాతీయ ప్రచార కార్యదర్శి జంగం దశరథ్ ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ నుంచి టీటీడీ బోర్డు సభ్యులుగా నియమితులైన నన్నూరు నర్సిరెడ్డి ఇతర సభ్యులకు ఆయన అభినందనలు తెలిపారు.

- టీ పీసీసీ అధ్యక్షుడికి శుభాకాంక్షలు



దీపావళి పండుగను పురస్కరించుకుని టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్, లేబర్ బోర్డు మాజీ వైస్ చైర్మన్ నాగభూషణం, ఆలిండియా సర్వ సేవా సంఘం అధ్యక్షుడు వెదురి అరవింద్‌రెడ్డి, శ్రీమంతుగిరి, చందు పటేల్, తొలుపునూరి నరేష్‌గౌడ్.
- నల్లకుంట, ఆంధ్రజ్యోతి

మహంకాళి ఆలయంలో కార్తీకమాసం ఆకాశదీపం

నల్లకుంట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ఆకాశదీపంతో ప్రారంభమవుతుందని, ఈ దీపం వెలుగు వల్ల సమాజంలో అజ్ఞానం చీకట్లు తొలగి ఆధ్యాత్మిక జ్యోతి ప్రజ్వలిస్తుందని అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి చైర్మన్ పంజాల జ్ఞానేశ్వర్‌గౌడ్, అంబర్‌పేట బొడ్రాయి పున:నిర్మాణ కమిటీ కన్వీనర్ చింతల శ్రీనివాస్ ముదిరాజ్‌లు పేర్కొన్నారు. అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి ఆధ్వర్యంలో మహంకాళి దేవాలయం వద్ద కార్తీకమాసం ఆకాశ దీపం పూజలను వారు ప్రారంభించి మాట్లాడారు. ఈ పూజా కార్యక్రమంలో అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి ప్రధాన కార్యదర్శి బింది మల్లికార్జున్‌గౌడ్, కార్యదర్శి చెంగల్ సుధాకర్, కోశాధికారి గడ్డం శ్రీధర్‌గౌడ్, కమిటీ ప్రతినిధులు మోర పాండు ముదిరాజ్, డి.తుకారం, మోర భోజరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రయాణికుడి బ్యాగును తస్కరించిన దొంగ

బర్కత్‌పుర, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణికుడి బ్యాగును దొంగ తస్కరించాడు, కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన నూతన్‌రమేష్(38) నాగోర్ సోల్‌లో అజంత ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కి నగరానికి వస్తున్నాడు. నిజామాబాద్ వద్దకు రాగానే ఓ దొంగ నూతన్‌రమేష్ ఉన్న బోగీలోకి వచ్చి బ్యాగును తీసుకుని పారిపోయాడు. ఆ బ్యాగులో 15 గ్రాముల గోల్డ్ చైన్, ఒక సెల్‌ఫోన్, 700 రూపాయల నగదు ఉన్నట్లు తెలిపారు. కాచిగూడకు ఆదివారం వచ్చిన తర్వాత రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని విచారణ నిమిత్తం నిజామాబాద్ రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.

ఎంఎంటీఎస్ రైలు ఢీకొని వాచ్‌మన్ మృతి

బర్కత్‌పుర, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎంఎంటీఎస్ రైలు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి నిమ్స్‌లో చికిత్స పొందుతున్న వాచ్‌మన్ పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందాడు. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. వట్టిపల్లిలో నివాసం ఉంటున్న మహ్మద్‌గౌస్ (58) అపార్ట్‌మెంట్ వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. గత నెల 30న వట్టిపల్లి వద్ద రైలుపట్టాలు దాటుతుండగా ఎంఎంటీఎస్ రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన ఆయనను వైద్య చికిత్సల నిమిత్తం నిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతి చెందినట్లు సీఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఓడియన్ మాల్ సిద్ధం



ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో ఐమాక్స్ తరహా మల్టీప్లెక్స్ నిర్మాణంలో తుళ్ల ఓడియన్ కాంప్లెక్స్ మాల్ ప్రారంభానికి సిద్ధమైంది. ఈ మాల్‌లో దాదాపు ఎనిమిది మినీ థియేటర్‌లతో పాటు షాపింగ్ కాంప్లెక్స్, గేమ్స్ సెంటర్స్ ఉన్నాయి.
- చిక్కడపల్లి, ఆంధ్రజ్యోతి

సెక్యూరిటీ గార్డు అదృశ్యం



ఆనందరావు

రాంనగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్న వ్యక్తి బయటకు వెళ్లి అదృశ్యమయ్యారు. నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన సంఘటన పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నర్సింహబస్తీలో నివాసం ఉంటున్న ఎస్.ఆనందరావు (44) భార్య, కుమార్తె ఉన్నారు. తార్నాకలోని ఐఐసీటీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నారు. అతను కొంత కాలం క్రితం మద్యానికి బానిసగా మారాడు. గతనెల 28వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. ఆనందరావు భార్య ఉమ నల్లకుంట పీఎస్‌లో ఆదివారం ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పీఎస్ సీఐ బి.జగదీశ్వర్‌రావు పర్యవేక్షణలో ఎస్ఐ కృష్ణ కేసు నమోదు చేసుకుని అతని కోసం పర్యవేక్షిస్తున్నారు. అతని ఆచూకీ తెలిసిన వారు నల్లకుంట పీఎస్‌లో నేరుగా లేదా 9676557542 ఫోన్ నెంబర్‌లో తెలియజేయాలని కోరారు.

సదర్ ఉత్సవాలను అధికారికంగా నిర్వహించడం గర్వకారణం

రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్



వేడుకల్లో అనిల్‌కుమార్‌యాదవ్ తదితరులు

రాంనగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సదర్ ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం యాదవులకు గర్వకారణమని రాజ్యసభసభ్యులు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. శనివారం రాత్రి రాంనగర్ చౌరస్తాలో రాంనగర్ యాదవ సంఘం నేతలు ఎం.విజయ్‌యాదవ్, సలాంద్రి వెంకటేష్‌యాదవ్‌ల ఆధ్వర్యంలో జరిగిన సదర్ వేడుకలకు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యాదవులతో కలిసి ఆయన వేదికపై సందడి చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్‌యాదవ్, బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూస రాజు, నవీన్‌యాదవ్ పాల్గొన్నారు.

చిక్కడపల్లి: యాదవ సోదరులు ఘనంగా నిర్వహించే సదర్ పండుగను గాంధీనగర్ డివిజన్‌లో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా బీజేపీ ఓబీసీమోర్చా జాతీయ కార్యవర్గసభ్యులు పూస రాజు, బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ పాల్గొన్నారు. బీజేవైఎం డివిజన్ ఉపాధ్యక్షుడు సంపత్‌యాదవ్, రాజు యాదవ్ ఆధ్వర్యంలో స్వామివివేకానందనగర్ బస్తీఓ నిర్వహించిన సదర్ సయ్యాట 2024లో దున్నపోతు విన్యాసాలను బీజేపీ నాయకులు తిలకించారు. సాయికుమార్, జ్ఞానేశ్వర్, ఆనంద్‌రావు, ఆకుల అభిషేక్, ధనరాజ్ తదితరులు హాజరయ్యారు.